సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.15,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15,500 పలికాయి. మార్కెట్‌కు 458 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.53
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.53 పలికింది. మార్కెట్‌కు 1,950 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం కొంచెం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పెనుకొండ: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టింది. ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారికి 'సీడాప్', డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలల పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్‌లో ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది. 18 నుంచి 26 ఏళ్లలోపు వయసున్న వారు శిక్షణకు అర్హులని, శిక్షణ సమయంలో రూ. 22 వేల స్టైఫండ్, ఉచిత భోజన వసతి కల్పిస్తామని జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సేల్స్ సూపర్‌వైజర్ ఉద్యోగాలు సైతం కల్పిస్తామని ఆమె వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలకు 7989479371 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

భయపడొద్దు.. మేమున్నాం

- కానిస్టేబుల్‌కు ధైర్యం చెప్పిన ఎస్పీ



ఎస్పీతో మాట్లాడుతున్న కానిస్టేబుల్ రణధీర్

పుట్టపర్తి టౌన్: 'భయపడొద్దు..మేమంతా ఉన్నాం కదా..నీకేం ఇబ్బంది రానివ్వం..తప్పక ఆదుకుంటాం' అని ఎస్పీ మాధవరెడ్డి ఇటీవల పుంగనూరు ఘటనలో గాయపడి కన్ను కోల్పోయిన కానిస్టేబుల్ రణధీర్‌కు ధైర్యం చెప్పారు. శనివారం రణధీర్ కుటుంబీకులతో కలిసి ఎస్పీని ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పుంగనూరు ఘటన గురించి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..పోలీస్ శాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం త్వరగా అందేలా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అలాగే పోలీస్ శాఖ నుంచి కూడా ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

కాచిగూడ- విల్లాపురం మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కాచిగూడ - విల్లాపురం మధ్య 14, 15 తేదీల్లో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న సాయంత్రం 5.45 గంటలకు కాచిగూడ జంక్షన్ నుంచి రైలు (నంబర్ 07424) బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విల్లాపురం చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి విల్లాపురం జంక్షన్ నుంచి 15న సాయంత్రం 4.50 గంటలకు రైలు (నంబర్ 07425) బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు కాచిగూడ చేరుతుందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్, బేగంపేట్, తాండూరు, శిరం, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప మీదుగా విల్లాపురం చేరుతుందని వివరించారు.

'1962'లో ఉద్యోగావకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 1962 హెల్ప్‌లైన్ కింద ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ గౌడ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఓడీ చెరువు, తలుపుల కేంద్రంగా పనిచేస్తున్న రెండు వాహనాలకు పశువుల డాక్టర్లు (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్-వీఏఎస్) రెండు పోస్టులు, చెన్నేకొత్తపల్లి కేంద్రంగా పనిచేస్తున్న మరో వాహనానికి డ్రైవర్ (పైలట్) పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ పోస్టుకు బీవీఎస్సీ కోర్సు చేసిన వారు అర్హులు. అలాగే పది ఉత్తీర్ణతతో పాటు హెవీ డ్రైవింగ్ కలిగిన వారు పైలట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు జిల్లాల పరిధిలో అర్హత, ఆసక్తి ఉన్న వారు 96525 33554 నంబరులో సంప్రదించవచ్చు.

మెట్ట భూముల్లో జలకళ

వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు వైఎస్ జగన్ సర్కార్ 'వైఎస్సార్ జలకళ' పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద మెట్ట భూముల్లో ఉచితంగా బోర్లు వేస్తోంది. అంతేకాకుండా విద్యుత్ కనెక్షన్, మోటార్ కూడా ఉచితంగా ఇస్తోంది. దీంతో చిన్న, సన్నకారు రైతుల మోముల్లో ఆనందం వికసిస్తోంది. సాగునీటి సౌకర్యం ఉండటంతో ఉత్సాహంగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.



ఈ చిత్రంలోని రైతు పేరు గంగిరెడ్డి.. చిన్నకారు రైతు. పుట్టపర్తి మండలం వెల్లోపల్లి గ్రామం. ఆయనకు 4.5 ఎకరాల భూమి ఉంది. గతంలో రెండు సార్లు బోర్లు వేసినా.. నీళ్లు పడలేదు. 'వైఎస్సార్ జలకళ' పథకంలో దరఖాస్తు చేసుకోగా గత ఏడాది బోరు వేశారు. నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. విద్యుత్ సర్వీస్ తీసుకోగానే అధికారులు సబ్‌మెర్సిబుల్ పంపుసెట్, పైపులు, స్టార్టర్, మోటర్‌కు కావాల్సిన అన్ని పరికరాలు అందజేసి జియోట్యాగింగ్ చేశారు. మరో రెండు రోజుల్లో మోటర్ బిగించేందుకు వస్తామని సిబ్బంది చెప్పారని గంగిరెడ్డి సంతోషంగా చెబుతున్నారు. సాగునీటికి ఇబ్బంది లేనందువల్ల ఉద్యానపంటలు సాగు చేసుకుంటానని, అవసరమైతే చుట్టు పక్కన ఉన్న రైతులకూ నీళ్లు ఇచ్చి పంటలను కాపాడుతానని చెబుతున్నారు.

రైతులకు వరంగా మారిన 'జలకళ'

- బోరు, విద్యుత్ కనెక్షన్, మోటారు ఉచితం
- ఇప్పటికే బోర్లు వేసిన రైతులకు మోటార్లు
- ఉద్యాన పంటల సాగుకు ఊతం



జలకళ పథకం కింద పుట్టపర్తి సమీపంలోని ఓ రైతు పొలంలో బోరు వేస్తున్న దృశ్యం (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: చిన్న, సన్నకారు రైతులకు 'జలకళ' పథకం ఉపయుక్తంగా మారింది. ఇప్పటికే జలకళ పథకం కింద బోర్లు వేసుకొని విద్యుత్ కనెక్షన్ తీసుకున్న రైతులకు సబ్ మెర్సిబుల్ పంపుసెట్లు అందజేసే కార్యక్రమం ఊపందుకుంది. ఇప్పటివరకూ వేసిన బోర్లకు మోటర్లు అమర్చే ప్రక్రియ పూర్తయితే ప్రత్యక్షంగా 7 వేల ఎకరాలకుపైగా మెట్ట భూమి సాగులోకి రానుంది.

1,592 మంది రైతుల పొలాల్లో బోర్లు..

ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర క్లస్టర్ల పరిధిలోని 1,592 మంది రైతుల పొలాల్లో ప్రభుత్వం 'జలకళ'పథకం కింద బోర్లు వేసింది. ఇందుకుగాను రూ.20.74 కోట్ల మేర ఖర్చు చేసింది. ఇందులో 185 మంది రైతులు బోర్‌వెల్, విద్యుత్ కనెక్షన్ల కోసం ఆధారాలివ్వగా, ఇప్పటి వరకూ 96 మంది విద్యుత్ సర్వీస్‌లు తీసుకున్నారు. వీరిలో 36 మందికి మూడ్రోజుల క్రితం ప్రభుత్వం మోటర్లు ఇచ్చింది. ఇందుకు రూ.2.25 కోట్లు ఖర్చు చేసింది.

రూ.22.99 కోట్ల ఖర్చు..

జిల్లాలో జలకళ పథకం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ బోర్లు తవ్వకానికి రూ. రూ.20.74 కోట్లు మోటార్ల కొనుగోలుకు రూ.2.25 కోట్లు మొత్తంగా రూ.22.99 కోట్లు ఖర్చు చేసింది.

మంజూరు ఇలా..

చిన్న, సన్నకారు రైతులను 'జలకళ' పథకానికి ఎంపికకు రైతుల పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్, తదితర వివరాలను సేకరిస్తారు. వీఆర్‌ఓ లాగిన్‌లో 'జలకళ'బోరు మంజూరు కాగానే ఆ ఫైలు ఉపాధి పథకం అధికారులకు చేరుతుంది. వారు సర్వే చేసి రైతు అర్హతలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ వెంటనే భూగర్భజల శాఖ అధికారులు రైతు పొలంలో నీటి లభ్యత ఉన్న ప్రాంతాన్ని గుర్తించి బోరు పాయింట్ ఇస్తారు. జియోట్యాగింగ్ పూర్తి కాగానే బోరు వేస్తారు. రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం ఆధారాలివ్వగానే స్తంభాలు అమర్చి లైను లాగి, సర్వీస్ నంబర్ ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఆ వివరాలను కలెక్టర్‌కు పంపుతారు. అనుమతులు రాగానే పంప్‌సెట్లు అమరుస్తారు. ఇలా ఇప్పటికే 36 మందికి మోటార్లు అందించారు. త్వరలోనే మిగతా వారికీ అందించేందుకు చర్యలు చేపట్టారు.

1,592	జలకళ కింద వేసిన బోర్లు
రూ.20.74 కోట్లు	బోర్లు వేసేందుకు చేసిన ఖర్చు
185 మంది	విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు
96 మంది	విద్యుత్ కనెక్షన్లు తీసుకున్న వారు
36 మంది	పంపుసెట్లు అందుకున్న రైతుల సంఖ్య
రూ.2.25 కోట్లు	పంపుసెట్లకు ప్రభుత్వం చేసిన ఖర్చు

రెండున్నర ఇంచుల నీళ్లు పడ్డాయి



నేను 11 బోర్లు వేసినా... ఫలితం లేకపోయింది. బోర్లు వేయించేందుకు చేసిన అప్పు తీర్చేందుకు రెండెకరాలు అమ్ముకున్నా. ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నా. గత ఏడాది 'జలకళ' పథకంలో నా పొలంలో బోరు వేయగా రెండున్నర ఇంచుల నీళ్లు పడ్డాయి. చాలా సంతోషంగా ఉంది. మాలాంటి వారికి సాయంగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కేశవరెడ్డి, బుచ్చయ్యగారిపల్లి

పైసా ఖర్చు లేకుండా బోరు వేశారు



నాకు 4 ఎకరాలుండగా నీటి వసతి కోసం నాలుగు బోర్లు వేసినా నీరు పడలేదు. ఆర్థికంగా నష్టపోయా. గత ఏడాది 'జలకళ'కు దరఖాస్తు చేసుకోగా, అధికారులు పైసా ఖర్చు లేకుండానే బోరు వేశారు. మూడించుల నీళ్లు పడ్డాయి. మోటర్, స్టార్టర్, పైపులు కూడా ఇస్తామన్నారు. అందుకే ఈసారి ఉద్యాన పంటల సాగుకు సిద్ధమయ్యా.

– గంగులప్ప, బుక్కపట్నం

నేరం చేస్తే ఎవరినీ వదలం

- వెంకటరమణపల్లి ఘటనలో 9 మందికి రిమాండ్
- పరారీలో మరో ఐదుగురు
- ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి, చిత్రంలో డీఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ సుబ్బరాయుడు

పుట్టపర్తి టౌన్: నేరం చేసిన వారు ఎవరైనా, ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఎస్పీ మాధవరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ హుస్సేన్ పీరా, గోరంట్ల సీఐ సుబ్బరాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గోరంట్ల మండలం వెంకటరమణపల్లిలో శుక్రవారం రెండు సెంట్ల స్థల వివాదంలో రెండువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుందన్నారు. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారని, వారంతా చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఘర్షణకు కారణమైన వెంకటరమణపల్లికి చెందిన చౌడిరెడ్డి, శెట్టి చిన్నంపల్లికి చెందిన చెన్నకేశవరెడ్డి, ప్రకాశం జిల్లాకు చెందిన పిడుగు రామకృష్ణారెడ్డి, బెంగళూరుకు చెందిన జాన్, తమిళనాడుకు చెందిన విఘ్నేష్, కోలార్ జిల్లా బత్తలమద్రి గ్రామానికి చెందిన దామోదర్, ఒంగోలుకు చెందిన కోళ్ల మనోహర్, ప్రకాశం జిల్లాకు చెందిన చిత్తంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు జిల్లాకు చెందిన చార్లెస్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న ఇనుపరాడ్లు, క్రికెట్ స్టంపులు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇదే కేసులో నిందితులైన హనుమంతరెడ్డి, మద్దిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పరారీలో ఉన్నారని, త్వరలో వారిని అదుపులోనికి తీసుకుంటామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏ రాజకీయ పార్టీకీ సంబంధం లేదన్నారు.

సామాన్యుల రక్షణ మా బాధ్యత..


సామాన్యులను రక్షించడమే పోలీసు బాధ్యత అని, ఆ విధంగానే జిల్లా పోలీసులు నడుచుకుంటున్నారని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ జిల్లాలో నేరాలు అదుపులోకి తీసుకురావడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నారన్నారు. నేరస్తులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈక్రమంలోనే 2019లో గోరంట్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఓ బాలికపై లైంగిక దాడి చేయగా, సాక్ష్యాధారాలన్నీ కోర్టుకు సమర్పించి అతనికి శిక్ష పడేలా చూశామన్నారు. ఈ కేసులో న్యాయస్థానం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పిందన్నారు. అలా ప్రతి కేసుపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా పోలీసులు పనిచేస్తున్నారన్నారు.

సినిమాకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

- బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం
- ఇద్దరు బాలల దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- పావగడ సమీపంలో ఘటన
- మృతులు రొద్దం మండలం చిన్నకోడిపల్లి వాసులు



సంఘటనా స్థలంలో ఈశ్వర్, జశ్వంత్, రాము




మృతులు జశ్వంత్ (ఫైల్), ఈశ్వర్ (ఫైల్)

రొద్దం/పావగడ: సినిమా చూసేందుకు ఉత్సాహంగా బయలుదేరిన ముగ్గురు మిత్రులు మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. ఇందులో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం ఉదయం కర్ణాటక రాష్ట్రం పావగడ సమీపంలోని కడమలకుంటి గ్రామం గేటు వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రొద్దం మండలం చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన కురుబ అంజినప్ప కుమారుడు ఈశ్వర్ (15), కురుబ ధనుంజయ కుమారుడు జశ్వంత్(15), చాకలి పరమేష్ కుమారుడు రాము మిత్రులు. ఈశ్వర్, జశ్వంత్ పదో తరగతి, రాము ఇంటర్ చదువుతున్నారు. రెండో శనివారం సెలవు కావడంతో చిరంజీవి నటించిన భోళా శంకర్ సినిమా చూసేందుకు పావగడ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. జశ్వంత్ బైక్‌పై ముగ్గురూ స్వగ్రామం నుంచి బయలుదేరారు. కడమలకుంటి గ్రామం గేటు వద్దకు రాగానే పావగడ నుంచి రొద్దం వైపు వేగంగా వెళ్తున్న బొలెరో (ఏపీ 39టీవీ 2258) వాహనం వీరి బైక్‌ను ఢీ కొంది. ముగ్గురూ కింద పడిపోయారు. బైక్‌పై ఉన్న ఈశ్వర్, జశ్వంత్ తలలు పగిలి తీవ్రరక్తస్రావం కాగా, వారు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రామును స్థానికులు పావగడ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానిక సీఐ అజయ్ సారథి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వర్, జశ్వంత్ మృతితో చిన్నకోడిపల్లిలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికొచ్చిన కుమారులు ఇలా అర్ధాంతరంగా రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

క్లుప్తంగా

ప్రత్యేక హోదా కోసం దివ్యాంగుడి ట్రై సైకిల్ యాత్ర



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగుడు ప్రసాద్

పుట్టపర్తి: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్ సాధనకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు దివ్యాంగుడు ఎన్. ప్రసాద్ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఢిల్లీకి చేపట్టిన ట్రై సైకిల్ యాత్ర శనివారం పుట్టపర్తి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గట్టిగా పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. దివ్యాంగుడు ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా బూరగం గ్రామానికి చెందిన తాను 19 నెలల క్రితం ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

టీకాల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించండి

హిందూపురం టౌన్: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. హిందూపురంలోని లక్ష్మీపురం డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ, పరిసర పీహెచ్‌సీల వైద్యులతో ఆయన సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించే బాధ్యత వైద్యాధికారులదేనన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను యాప్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, పట్టణ వైద్యులు పాల్గొన్నారు.

విద్యా దీవెన అర్హుల ఈ-కేవైసీ పూర్తి చేయండి

ప్రశాంతి నిలయం: జగనన్న విద్యా దీవెన మూడో విడత అర్హుల ఈ-కేవైసీని పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారితాధికారి శివరంగ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. విద్యార్థుల అకడమిక్ ఫర్మార్మెన్స్ రిపోర్టును జ్ఞానభూమి పోర్టల్‌లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 30 లోపు పూర్తి కావాలన్నారు.

పశు వైద్యానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగానే పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. పశు వైద్య సేవల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 1962తో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచింది. వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లు నిరంతరం పని చేస్తుండటంతో పాడిరైతులకు భరోసా లభిస్తోంది.

- 346 ఆర్‌బీకేలో 108 రకాల అత్యవసర మందులు
- 85 పశువుల ఆస్పత్రుల్లో 163 రకాల మందులతో వైద్యం
- నిరంతర సేవలో 1962 మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు





పశువుకు శస్త్రచికిత్స చేస్తున్న పశుశాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్ సునీత

అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ గ్రామానా ఏర్పాటు చేసిన ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా ప్రభుత్వ ఫలాలు రైతు ముంగిటకే అందిస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి రైతుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. విత్తనం మొదలుకుని విక్రయాలు, విపత్తు సాయం వరకు ఆర్‌బీకే వేదికగానే జరుగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు చాలా మేలు జరుగుతోంది. తాజాగా పశుసంపద, జీవసంపద పరిరక్షణకు తక్షణ వైద్యసహాయం అందించడానికి వీలుగా ఆర్‌బీకేల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు.

పెరిగిన పశువైద్య సేవలు

ఇటీవల పశుసంవర్ధకశాఖ ద్వారా అనంతపురం, ఉరవకొండ డివిజన్ల పరిధిలో ఉన్న 346 ఆర్‌బీకేలకు రూ.1.15 కోట్ల విలువ చేసే 108 రకాల మందులు పంపిణీ చేశారు. ఒక్కో ఆర్‌బీకేకు రూ.33 వేలు విలువ చేసే అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. సిరంజి మొదలుకుని యాంటీబయాటిక్స్ వరకు పంపిణీ చేశారు. అలాగే పశుశాఖ ద్వారా 14 గ్రామీణ పశువైద్య కేంద్రాలు (ఆర్‌ఎల్‌యూ), 56 వెటర్నరీ డిస్పెన్సరీలు (వీడీలు), 15 ప్రాంతీయ పశు వైద్యశాలల (వీహెచ్)కు కూడా ఆరు నెలలకు సరిపడా రూ.1.45 కోట్లు విలువ చేసే 163 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కాకుండా ఏటా సుమారు రూ.10 కోట్లకు పైగా విలువ చేసే డీవార్మింగ్ (నట్టల మందు), గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ), జబ్బ, పొదుగువ్యాధి, బ్రూసెల్లోసీస్, ముచ్చవ్యాధి లాంటి సీజనల్ వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయి. జిల్లాలో 2,15,900 ఆవులు, ఎద్దులు ఉండగా, 1,89,840 గేదెలు, 22,97,300 గొర్రెలు, 4,12,094 మేకలతో పాటు పందులు, కుక్కలు, పిల్లులు, కోళ్లు, గాడిదలు, గుర్రాలు లాంటి మూగజీవాలు ఉన్నాయి.

జిల్లాలో పశు సంపద ఇలా..

ఆవులు, ఎద్దులు	2,15,900
గేదెలు	1,89,840
గొర్రెలు	22,97,300
మేకలు, ఇతర జీవులు	4,12,094

తక్షణ వైద్య సేవలు



మూగజీవాలకు ఎలాంటి వైద్యచికిత్సలు అవసరమైనా అందించడానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నాము. నియోజక వర్గ పరిధిలో వెటర్నరీ ల్యాబ్‌ల ద్వారా వివిధ రకాల రక్త, మల, మూత్ర, అవయవ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ, చికిత్సలు చేస్తున్నాము. 1962 హెల్ప్‌లైన్ ద్వారా నియోజకవర్గానికి రెండు చొప్పున వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లు నిరంతరం పనిచేస్తున్నాయి. పశుశాఖ డాక్టర్లు, ఏడీలు, పారాస్టాఫ్‌తో పాటు 1962 డాక్టర్లు సమన్వయంతో అరుదైన శస్త్రచికిత్సలు చేస్తుండటంతో పశుసంపద, జీవసంపద పరిరక్షణకు ఢోకా లేదు. 175 ప్రాంతాల్లో గోపాలమిత్రల ద్వారా పశువైద్య సేవలు సమర్థవంతంగా అందిస్తున్నారు.

– వై.సుబ్రహ్మణ్యం, పశుశాఖ జేడీ, అనంతపురం

హాసినికి లక్కీ ఛాన్స్

- అమెరికాలో సంవత్సరం పాటు చదువుకునే అవకాశం
- ధర్మవరం మండలం మల్లేనిపల్లిలో ఆనందోత్సాహాలు



హాసినిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం రూరల్: చదవాలన్న కోరిక ఉంటే చాలు... ఏ దేశంలోని వర్సిటీలోనైనా...ఏ కోర్సు చేయాలన్నా మన ప్రభుత్వం చదివిస్తుందని తరచూ చెప్పే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు. 'జగనన్న విదేశీ విద్యాదీవెన' పథకం ద్వారా ఇప్పటికే వందలాది మంది విద్యార్థులను ప్రపంచంలోనే పేరుగాంచిన యూనివర్సిటీల్లో చదివిస్తున్నారు. తాజాగా ధర్మవరం మండలం మల్లేనిపల్లి గ్రామానికి చెందిన బాలిగ హాసిని అమెరికాలో సంవత్సరం పాటు చదువుకునేందుకు తోడ్పాటు అందించారు. కెన్నడీ లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రాం (కేఎల్‌వైఈఎస్)కు దేశ వ్యాప్తంగా 30 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, వారిలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు ఉన్నారు. అందులో మల్లేనిపల్లి గ్రామానికి చెందిన బాలిగ హాసిని కూడా ఒకరు. కేఎల్‌వైఈఎస్ కింద ఎంపికైన విద్యార్థులు అమెరికాలో హోస్ట్ ఫ్యామిలీగా ఏడాది పాటు అక్కడే విద్యాభ్యాసం కొనసాగించనున్నారు. ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు కానుండగా... ఈ మొత్తాన్ని చెల్లించేందుకు నీతి ఆయోగ్ ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. కెన్నడీ లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రాం ఎంపికైన హాసిని తల్లిదండ్రులు బాలిగ నరసింహులు, నాగమణితోపాటు గ్రామస్తులు అభినందించారు. హాసిని 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గుత్తి ఏపీఆర్ఎస్ (గురుకులం)లో, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (బైపీసీ) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (కృష్ణాజిల్లా) లో విద్యాభ్యాసం చేస్తోంది.



రబియాబి (ఫైల్)

ప్రథమ స్వాతంత్య్రసమరం రగిల్చిన స్వాతంత్య్ర కాంక్ష లక్షలాది మహిళలను స్వాతంత్య్రోద్యమం వైపు నడిపించింది. పూర్వీకుల అసమాన పోరాటాలను వారసత్వంగా స్వీకరించిన ముస్లిం మహిళలు 1906 నాటి స్వదేశీ ఉద్యమంతో పోరు ప్రారంభించి... ఖిలాఫత్ ఉద్యమం ద్వారా పెద్ద సంఖ్యలో జాతీయోద్యమంలో అడుగు పెట్టారు. జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన సహాయ నిరాకరణోద్యమం, విదేశీవస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం లాంటి పలు కార్యక్రమాలలో బృహత్తర పాత్ర నిర్వహించారు. అలాంటి వారిలో రబియాబి ఒకరు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సాగుతున్న 'నా భూమి- నా దేశం' కార్యక్రమాల్లో భాగంగా జాతీయోద్యమంలో పాలుపంచుకున్న మహనీయుల స్మరణలో 'సాక్షి' ప్రత్యేక కథనం. – అనంతపురం కల్చరల్:

వీర మహిళ రబియాబి

- అంధ్రావని నుంచి తొలి ముస్లిం మహిళా సత్యాగ్రహిగా ఖ్యాతి

సందర్భం 'నా భూమి - నా దేశం'

అణువణువున దేశభక్తిని నింపుకున్న 'అనంత' వాసులు తెల్లవారిని తరిమికొట్టి చిరస్మరణీయులుగా నిలిచారు. దేశమంతటా స్వాతంత్య్ర ప్రదీప్తి ప్రజ్వలిస్తున్నప్పుడు ఎంతో మంది లో స్ఫూర్తి రగిలించి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఈ క్రమంలోనే జాతీయోద్యమంలో మేము సైతం అంటూ కట్టుబాట్లను కాదని పలువురు ముస్లిం మహిళలూ నడిచొచ్చారు. అలాంటి వారిలో అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన రబియాబి ప్రథమ స్థానంలో నిలిచారు. తన భర్త మొహిద్దీన్ సాహెబ్‌తో కలసి సత్యాగ్రహంలో పాల్గొని చరిత్ర సృష్టించారు. ఆంధ్రావనిలో ఒక ముస్లిం మహిళ వ్యక్తిగత సత్యాగ్రహ ఉద్యమంలో బహిరంగంగా పాల్గొనటం ఇదే ప్రథమమని నాడు పలువురు ఆమె చర్యలను కొనియాడారు.

కొత్తచెరువుకు సరికొత్త కీర్తి

ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన పుట్టపర్తి సమీపంలోని కొత్తచెరువులో 1926లో ఏప్రిల్ 4న జన్మించిన రబియాబీ.. కేవలం ఏడో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. చియ్యేడు గ్రామానికి చెందిన దేశభక్తుడైన మొహిద్దీన్ సాహెబ్‌ను పెళ్లాడిన తర్వాత స్వాతంత్య్రోద్యమం పట్ల ఆకర్షితురాలై దేశమాత విముక్తి కోసం పోరుబాట పట్టింది. ఖిలాఫత్, సహాయ నిరాకరణోద్యమాలు ఉధృతంగా సాగుతున్న ఆ రోజుల్లో రబియాబీ దంపతులు సాంఘిక నాటకాల ప్రదర్శనతో బ్రిటీష్ పాలకుల దమన నీతిని బహిరంగంగా ఎండగడుతూ వచ్చారు.

స్ఫూర్తి రగిల్చిన పోరాటం

స్వాతంత్య్ర సంగ్రామంలో పాలు పంచుకున్న వారి పట్ల అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఎంత కిరాతకంగా వ్యవహరిస్తోందో అందరూ చెబుతున్నా రబియాబీ వినకుండా అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా 1941, మార్చి 3న సాగిన సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోనే ఓ ముస్లిం మహిళ పాల్గొన్న మొట్టమొదటి సత్యాగ్రహం ఇదేనని అప్పట్లో ఉద్యమకారులు ఆమె ధైర్యసాహసాలను కొనియాడారు. 1942, సెప్టెంబర్ 6న వందలాది పోలీసులు చుట్టుముట్టి ఉండగా 'స్వాతంత్య్రం మా జన్మహక్కు, భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేయడమే కాక చిగిచెర్ల గ్రామం వద్ద రైలు పట్టాలను ధ్వంసం చేసి అరెస్టయ్యారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కూడా రబియాబి దంపతులు సాధారణ జీవితం సాగించారు. భర్త మొహిద్దీన్ సాహెబ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా రబియాబీ చియ్యేడు పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తించారు. వారికి సంతానం లేకపోయినా ముప్పైఏళ్ల కిందట ఆమె మరణించే వరకూ ఆ గ్రామ ప్రజలనే తమ బిడ్డలుగా భావించేవారు.

తెలుగు ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటండి



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

- చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి
- శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

చిలమత్తూరు: తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని కవులకు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి పిలుపు నిచ్చారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లి వద్ద ఉన్న విరాట్ ప్యాలెస్‌లో ఆదివారం లేపాక్షి కవితా వైభవం పేరుతో జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 106 మంది కవులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గౌరవం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర సరిహద్దు కావడం, మారుమూల ప్రాంతం కావడంతో తాను కర్ణాటకలో చదువుకోవాల్సి వచ్చిందని, అయినా మాతృభాషపై మమకారం వీడలేదన్నారు. హిందూపురం ప్రాంతంలో అభ్యుదయ కవులు, రచయితలు చాలామంది ఉన్నారని, వారి ప్రచురణలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని కొనియాడారు. పరభాషలన్నీ మన జీవన గమనానికి మాత్రమేనని నేటి తరం విద్యార్థులు తెలుసుకునేలా.. వారు తెలుగుపై మమకారం పెంచుకునేలా చైతన్యం తీసుకురావాలని కవులను కోరారు. జిల్లా సాహితీ ప్రవంతి కన్వీనర్ హరిగంగాధర మాట్లాడుతూ... పాశ్చాత్య భాషల మోజులో తెలుగు పూర్తిగా మాట్లాడలేని స్థితికి ప్రస్తుత సమాజం చేరుకుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జాతి ఉనికికే ప్రమాదకరమన్నారు. అనంతరం పలువురు కవులు కవితాగానంతో ఆకట్టుకున్నారు. ఎంపీపీతో సహా కవులను ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించారు. కేజీబీవీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, యువకవి సుధాకర్, ఎంఈఓ -2 సాల్మాన్‌రాజ్, ఉపాధ్యాయుడు అలీముల్లా, కస్తూర్బా ఎస్‌ఓ రెహానా, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రరెడ్డి, షాకీర్, హంప్సేన్‌పురం గ్రామస్తులు పాల్గొన్నారు..


యువకుడి దుర్మరణం



తరుణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

తలుపుల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తలుపుల మండలం మూలపల్లికి చెందిన ప్రసాద్ కుమారుడు తరుణ్ (14) శనివారం ఉదయం గజ్జిలవ్వగారిపల్లి నుంచి స్వగ్రామానికి స్కూటర్‌పై బయలుదేరాడు. మూలపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే బట్రేపల్లి వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి వేర్వేరుగా కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని తరుణ్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. తనవంతు సాయంగా ఎమ్మెల్యే రూ.20 వేలు అందించారు. ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుర్లి శివారెడ్డి, వరదరాజులు ఉన్నారు.

ఫుట్‌బాల్ లీగ్ ప్రారంభం



ఫుట్‌బాల్ లీగ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌ఆర్‌జీ విద్యాలయం వేదికగా అనంతపురం ఫుట్‌బాల్ లీగ్ పోటీలు శనివారం నిర్వహించారు. ఆరు మండలాల నుంచి 10 జట్లు పాల్గొనగా అండర్-7, అండర్-9, మిక్స్‌డ్ జెండర్ రౌండ్-1 పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జేవీ అనిల్‌కుమార్, ఎల్‌ఆర్‌జీ విద్యాలయ హెచ్‌ఎం ప్రసాద్ ప్రారంభించారు. కార్యదర్శి బీకే మహమ్మద్ సలీం, కోశాధికారి శేఖర్, ఈసీ మెంబర్ విజయవాణి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, వివిధ జట్ల మేనేజర్లు పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య



మృతుడు రామిరెడ్డి


ధర్మవరం అర్బన్: పెళ్లి కాలేదన్న మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని ప్రియాంక నగర్‌కు చెందిన కేశమ్మ, రమణారెడ్డి దంపతుల పెద్ద కుమారుడు దేవలం రామిరెడ్డి (30) స్కూటర్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. అయితే స్కూటర్ మెకానిక్‌కు పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన రామిరెడ్డి శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోని ఓ గదిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం తల్లి కేశమ్మ వెళ్లి తలుపు తోసి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడు కనిపించడంతో బోరున విలపించింది. పెళ్లి సంబంధాలు చూస్తున్నా ఎక్కడా కుదరకపోవడంతో తన కుమారుడు బాధపడుతుండేవాడని ఆమె కన్నీట పర్యంతమైంది. వార్డు కౌన్సిలరు మేడాపురం వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపాటి రామకృష్ణ అక్కడకు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనపై ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్మోగిన సాయి నామం

ప్రశాంతి నిలయం: సత్యసాయి నామస్మరణతో ప్రశాంతి నిలయం మార్మోగింది. సత్యసాయి నామాన్ని జపిస్తూ ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగితే ఆత్మ పరివర్తన సాధకులుగా ముక్తిమార్గాన్ని పొందుతారన్న సందేశంతో ఒడిశా భక్తులు ప్రదర్శించిన నృత్య రూపకాలు అలరించాయి. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయం చేరుకున్న ఒడిశా భక్తులు శనివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఉదయం సత్యసాయిని కీర్తిస్తూ 'హృదయ వీణ' పేరుతో కచేరి నిర్వహించారు. సాయంత్రం 'సాయిరామ నౌక' పేరుతో ఒడిశాలోని గంజాం జిల్లా సత్యసాయి భక్తులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కళాకారులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి సత్కరించారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు



నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు